గల్పిక:

# పౌరుషం

"హనుమాయమ్మగారూ, మా మరిదీవాళ్లు వచ్చారు. పాపం, పిల్లలు డడడా పాట వినాలని ఏడుస్తున్నారు. ఒక్కసారి మీ గ్రాంఫో నిప్పిద్దురూ!" అన్నది రామాయమ్మగారు.

"మా అబ్బాయి ఇంట్లో లేడండీ. వచ్చిన తరవాత చెబుతా లెండి," అన్నది హనుమాయమ్మగారు.

"అందాకా ఎందుకండీ? ఇప్పుడు, అయిదు నిమిషాల్లో పనివాడిచేత పంపించనూ? ఆ ఒక్క పాటే పెట్టుకు వింటారు. పాపం, పసివాళ్ళు."

"మా వాడికి తెలీకుండా ఇస్తే చంపెయ్యాడూ? ఇంకేమన్నా ఉందా? వాడూ భోజనానికి వచ్చే వేళ అయిందిలెండి."

"ఇంతలో గ్రాంఫోన్ పాడైపోదు లెండీ. మా మరిదిగారింట్లో ఇంతకన్న చాలా పెద్ద గ్రాంఫోనే ఉంది. వాళ్ళేం గ్రాంఫోన్ మొహం ఎరగనివాళ్ళు కారు," అన్నది రామాయమ్మ నిష్ఠురంగా, తను వచ్చిన పని కూడా మరిచిపోయినట్టు.

"గ్రాంఫోన్ మొహం మేమే ఎరుగుదుమన్నానా, అమ్మా? మా వాడు మా రాజిని కూడా గ్రాంఫోన్ ముట్టుకోనివ్వడు. అరిగిపోయిన పిన్‌లు పెట్టి రికార్డులు చెడగొడతారని వాడి భయం," అన్నది హనుమాయమ్మ.

రామాయమ్మకు లోపల మండిపోతున్నది. వెధవ గ్రాంఫోనుకని ఇంత బతిమాలించుకుంటారా? తన అంతర మెక్కడ ఈ హనుమాయమ్మ అంతర మెక్కడ? తమది రెండంతస్తుల మేడా, వాళ్లది మామూలు పెంకుటిల్లూనూ. ఈ హనుమాయమ్మ ఇంటి ఖర్చంతా కలిపి తమ పాల ఖర్చంత ఉండదు. దేహీ అని తను అడగవలసి వచ్చేసరికి హనుమాయమ్మ ఇన్ని మాటలు మాట్లాడుతుందా? తలుచుకుంటే ఇటువంటి గ్రాంఫోన్లు అరడజను కొనెయ్యగలడు తన ఇంటాయన. ఆయనకు ఉద్యోగం మీద నెలకు నాలుగొందలూ, పొలాల మీద సాలుకు నాలుగువేలూ వస్తాయన్న సంగతి ఈ హనుమాయమ్మ మరుస్తూ ఉంటుంది.

రామాయమ్మగారు ఘాటైనమాట తగిలిద్దామనుకుంటుండగా హనుమాయమ్మ కొడుకు రానే వచ్చాడు. ఆ ఇల్లాలు తన ఆగ్రహం కట్టిపెట్టి మళ్లీ యాచనాకంఠస్వరంతో, "నాయిన్నాయన! మీ గ్రాంఫోన్ ఓసారి ఇప్పిద్దూ మా మరిది పిల్లలూ వాళ్లూ వచ్చారు, డడడా పాట వినాలని ఏడుస్తున్నారు! మంచివాడివి!" అన్నది.

"గ్రాంఫోన్‌కేం గానండి. పిన్లు అయిపోయాయండీ. పదికూడా లేవు," అన్నాడు హనుమాయమ్మగారి అబ్బాయి.

"పదికూడా ఎందుకూ? ఒక్కసారి విని ఇప్పుడే పంపిస్తాగా?" అన్నది రామాయమ్మ.

మరో అయిదు నిమిషాలకు రామాయమ్మగారి నౌకరు వచ్చి గ్రామఫోనూ, రికార్డులూ, పిన్నుల డబ్బా పట్టుకెళ్లాడు. మరి కాస్సేపటికి గోడ అవతలినుంచి డడడా పాట వినిపించింది.

హనుమాయమ్మగారి అబ్బాయి ఆఫీసు వేళ అయి బయిల్దేరేలోపల "అబ్ తేరె సివా" పాట రెండుసార్లూ, "పియా ఘర్ ఆజా" పాట నాలుగుసార్లూ, డడడాపాట ఎనిమిదిసార్లూ మోగింది.

అతను సాయంకాలం ఇంటికి వచ్చేసరికి డడడా మారుమోగుతున్నది.

"వీళ్లకు పిన్లు ఎక్కడివి? కొత్తడబ్బా కొన్నారేమో! అప్పుడే తెచ్చిస్తామన్న గ్రామఫోను ఇంకా ఇవ్వలేదేమో?" అనుకుని అతను రామాయమ్మగారింటికి వెళ్లాడు. రామాయమ్మగారి మరిదికూతురు కాబోలు నాలుగేళ్ల పిల్ల రికార్డులు పెడుతున్నది. ఆ పిల్ల తండ్రికాబోలు పడకకుర్చీలో కూచుని తాళంప్రకారం కాలు ఆడిస్తున్నాడు.

"కొత్త పిన్లు కొన్నారా ఏం?" అన్నాడు హనుమాయమ్మగారబ్బాయి.

లేదు. కొత్తపిన్లు కొనలేదు. వాడినపిన్నులు అరలోనుంచి తీసి మళ్లా వాడి కొత్త పిన్నుల డబ్బాలో పోస్తున్నారు.

హనుమాయమ్మగారబ్బాయి మండిపడ్డాడు. గ్రామఫోన్ వాడటం చాతకాని వాళ్లు ఇతర్లది అరువు పట్టుకురాగూడదన్నాడు. ఇస్తామన్న టైముకు గ్రామఫోన్లు తిరిగివ్వకపోవటం చాలా పాడు అలవాటన్నాడు. రామాయమ్మగారి నౌకరు హాజర్లో లేనికారణంచేత తనే గ్రామఫోనూ, రికార్డులూ పట్టుకుని ఇంటికి వెళ్లిపోయినాడు.

రామాయమ్మగారు విజృంభించింది.

"ముండమోపి గ్రామఫోను. ఇవాళ, ఇప్పుడే, తక్షణం మీరు బజారు వెళ్ళి అంతకంటె మంచి గ్రామఫోను తెస్తారా, తీసుకురారా?" అన్నది హనుమాయమ్మ భర్తతో.

మరో వారంరోజుల్లో గ్రామఫోనూ, అయిదారు రికార్డులూ ఇంటికి వచ్చాయి. అందులో డడడాపాట కూడా ఉంది. ఆ పాట మూడురోజులపాటు పొద్దస్తమానమూ మోగింది. ఆతరవాత గ్రామఫోను చరీ చప్పుడూ లేదు.

కొన్ని నెల్లు గడిచాయి.

"ఇంట్లో గ్రాంఫో నుండి ఏం లాభం? వినీ వినీ పాటలు విసుగెత్తాయి," అన్నది రామాయమ్మ.

"ఎందు కొక్కనమన్నావ్? రోజు కో కొత్త రికార్డు కొనాలి. గ్రామఫోనంటే కొనిపారేశాగాని నిత్యమూ రికార్డు లెవరు కొంటారు? అందులో మంచివేవో నాకు తెలిసి చావదాయె."

నాకుమాత్రం తెలిసేడుచు కనకనా!" అంది రామాయమ్మ.

"అయితే మరి ఊరుకో!" అన్నాడు భర్త. మరొక నెల గడిచింది.

ఒకరోజు రామాయమ్మ హనుమాయమ్మగారిదగ్గిరికి ఆదరాబాదరా వచ్చి, "హనుమాయమ్మగారూ, మా చెల్లెలూ వాళ్లూ వచ్చారు. పిల్లలు లారాలప్పా పాట వినాలని ఏడుస్తున్నారు. కాస్త ఆ రికార్డిప్పిద్దురూ ఒక్కసారి పెట్టుకుని ఇప్పుడే పంపిస్తానూ," అన్నది.